ప్రజాశక్తి

బుధవారం 5 ఏప్రిల్ 2023 5

శ్రీ సత్యసాయి

ఏడాది పూర్తైనా.. ఎక్కడవేసిన గొంగళి అక్కడే..!

◆ సత్యసాయి జిల్లాలో మెరుగు పడని కార్యాలయ భవనాలు ◆ మౌలిక వసతులు శూన్యం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

నూతన సత్యసాయి జిల్లా ఏర్పడి మంగళవారం నాటికి సరిగ్గా ఏడాది పూర్తి అయ్యింది. 2022 ఏప్రిల్ 4వ తేదీన పుట్టపర్తి కేంద్రంగా నూతన జిల్లాలో పాలన ప్రారంభమైంది. కొత్త జిల్లా ప్రారంభమైన సందర్భంగా పట్టణంలోని హనుమాన్ సర్కిల్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించి జిల్లా ఏర్పాటుపై అప్పటి మంత్రి మాలగుండ్ల శంకరనారాయణ, ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యేలు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, పివి.సిద్ధారెడ్డి తదితరులు ఆర్భాటంగా సత్యసాయి జిల్లా ఏర్పాటు గురించి గొప్పగా వివరించారు. ఇది జరిగి ఏడాది పూర్తయిన ప్రభుత్వ కార్యాలయాల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది.

పుట్టపర్తిలో సత్యసాయి ట్రస్టు సమకూర్చిన భవనాల్లో తాత్కాలిక కార్యాలయాలను జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసుకోంది. సత్యసాయి విద్యాసంస్థ భవన సముదాయంలో కలెక్టరేట్, పర్తి ధర్మశాలలో ఎస్పీ కార్యాలయాలు కొంతవరకు మెరుగ్గా ఉన్నాయి. కొన్ని కార్యాలయాలు సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి ఎదురుగా సత్యసాయి ట్రస్ట్ భవనాలు ఏర్పాటు కాగా, మరికొన్ని పెద్ద కమ్మవారిపల్లిలోని దీనజనోద్ధారణ సముదాయంలో ఏర్పాటు చేశారు. ఇక్కడ ఇరుకైన గదుల్లో సుమారు 18 శాఖల కార్యాలయాలు ఉన్నాయి. ఇరుకైన గదుల్లో జిల్లాస్థాయి అధికారులు కాలం వెళ్లదీస్తున్నారు. కార్యాలయాలకు వెళ్లాలన్నా ప్రజలకు ఇబ్బందికరంగా ఉంది. అధికారులు కూడా చుట్టపుచూపుగా కార్యాలయాలకు వచ్చి వెళ్తున్నారు. ఇప్పటికీ కొన్ని శాఖలు ఉమ్మడి అనంతపురంలోనే కొనసాగుతున్నాయి. దేవాదాయశాఖ, కాలుష్య నివారణ మండలి శాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ, యువజన సర్వీసులు తదితర శాఖలు పూర్తిగా నియమించలేదు. ఏడాది అయినా పలు శాఖల అధికారులకు సరైన కార్యాలయాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. పేరుకు నూతన జిల్లా ఏర్పడిందే తప్పా, మౌలిక సదుపాయాలు లేక సరైన భవనాలు లేక అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు స్పందించి పూర్తి వసతులతో ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వసతులు లేకుండా పుట్టపర్తిలో ఉన్న ప్రభుత్వ భవన సముదాయాలు

కేతిరెడ్డి చుట్టూ యర్రగుట్ట వివాదం

◆ గూగుల్ మ్యాప్‌లోనూ ఆక్రమణ స్పష్టం ◆ టిడిపి మరోమారు ఆరోపణ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి చుట్టూ ఎర్రగుట్ట ఆక్రమణల వివాదం వీడటం లేదు. దీనిపై టిడిపి నేతల నుంచ మాటల యుద్ధం కొనసాగుతూనే ఉంది. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ యువగళం పాదయాత్ర సందర్భంగా చేసిన యర్రగుట్ట ఆక్రమణల ఆరోపణలు ఆగడం లేదు. దీనికి కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి కూడా విజయవాడలో ఏకంగా చంద్రబాబు నివాసం కరకట్ట ఆక్రమణ అని ఇంటి వద్దకెళ్లి సోషియల్ మీడియాలో ఘాటుగా ఆరోపణలు చేశారు. దీనిపై టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మరో ఆరోపణ తాజాగా చేయడమే కాకుండా, ధర్మవరం చెరువు అనుకుని ఉన్న యర్రగుట్టను ఏ రకంగా ఆక్రమించారన్న దానిపై మరింత ఆధారాలతో మంగళవారం నాడు ప్రకటన విడుదల చేశారు. పాదయాత్ర ధర్మవరం నియోజకవర్గం దాటి వచ్చినా కేతిరెడ్డిపై ఆరోపణలపర్వం మాత్రం ఆగడం లేదు.

ఎర్రగుట్టపై 20 ఎకరాలు ఆక్రమించరంటూ తాజాగా విడుదల చేసిన ప్రకటనలో టిడిపి పేర్కొంది. రికార్డుల ప్రకారం ఎర్రగుట్టపై కేతిరెడ్డి తమ్ముడి భార్య గాలి వసుమతి పేరుతో 25.38 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. మిగిలిన 20 ఎకరాల కబ్జా చేసారని ఆరోపిస్తున్నారు. ఎర్రగుట్ట మొత్తం ఉన్నది 45.47 ఎకరాలు ఉన్నది గూగుల్ మ్యాప్స్ ద్వారా స్పష్టమవుతోందన్నారు. ఇందులో సర్వే నెంబరు 904, 905,908ల్లో 25.38 ఎకరాల కొనుగోలు చేసి ఉంటే తక్కిన భూమి ఎక్కడి నుంచి వచ్చిందని ప్రశ్నించారు. కొనుగోలు చేసామని చెబుతున్న 25.38 ఎకరాల్లోనూ ఎనిమిది ఎకరాలు వసుమతికి పిత్రార్జితంగా వచ్చినట్టు చూపించారని తెలిపారు. కర్నూలు జిల్లాకు చెందిన వసుమతికి ఇక్కడ పిత్రార్జితనంగా ఏ రకంగా వచ్చిందో చెప్పాలని ప్రశ్నించారు. తక్కిన 20 ఎకరాలు ఆక్రమణ కాదా... దీనికి సమాధానం చెప్పాలని ప్రశ్నిస్తున్నారు. ఇలా ఇద్దరి మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈ యర్రగుట్ట వివాదం చాలాకాలంగానే నడుస్తోంది. అంతకు మునుపు కూడా మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ సైతం దీనిపై ఆరోపణలు చేయడమే కాకుండా గ్రీన్ ట్రిబ్యూనల్‌కు ఫిర్యాదు చేస్తున్నట్టు తెలిపారు. కేతిరెడ్డికి సంబంధించి రాజకీయపరమైన విమర్శలు, ఆరోపణలు ఏ రూపంలో వచ్చినా మొదటగా వస్తున్నది యర్రగుట్ట అంశమే కావడం గమనార్హం. ఇప్పుడు నారా లోకేశ్ ఆరోపణలతోపాటు, సెల్ఫీ ఛాలెంజ్‌తో ఈ అంశం రాష్ట్ర వ్యాప్తమైంది. ఇవి వచ్చే సార్వత్రిక ఎన్నికల వరకు ఇదే అంశం ప్రతిపక్ష పార్టీ సభ్యులకు అస్త్రంగా మారే అవకాశముంది. దీన్ని ఏ విధంగా కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తిప్పికొడతారో చూడాల్సి ఉంది.

అశాంతి నిలయంగా మార్చొద్దు..!

పాముదుర్తి ఇంద్రజిత్‌రెడ్డి

ప్రజాశక్తి-బుక్కపట్నం

ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తి ప్రశాంతి నిలయాన్ని రాజకీయ నాయకులు వారి వ్యక్తిగత ప్రయోజనాల కోసం అశాంతి నిలయంగా మారుస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని వైసిపి నాయకులు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రారెడ్డి తనయుడు పాముదుర్తి ఇంద్రజిత్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పుట్టపర్తి ప్రశాంతతకు మారుపేరు అన్నారు. కొన్ని రోజుల క్రితం రాజకీయ పార్టీల మధ్య అత్యంత దురదష్టకర ఘటన చోటు చేసుకుందని చెప్పారు. ఇలాంటి చర్యల వల్ల పుట్టపర్తికి చెడ్డపేరు వస్తుందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు కఠిన చర్యలు చేపట్టాలన్నారు. పుట్టపర్తి చుట్టూ ఐదు కిలోమీటర్లు టెంపుల్ జోన్‌గా గుర్తించి సభలు సమావేశాలను నిషేధించాలని కోరారు. వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నందున ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించాలని తెలిపారు. టిడిపి కవ్వింపు చర్యలకు పాల్పడితే ఇతర ప్రాంతాల్లో వారికి సమాధానం చెప్పాలని సూచించారు.

నేడు మూడోవిడత ఆసరా పంపిణీ

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంలోని మైనార్టీ ఫంక్షన్ హాల్‌లో మూడో విడత ఆసరా పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ సుధామణి తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే డా॥పివి.సిద్ధారెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. ఉదయం 9:30 గంటలకు ప్రారంభం అయ్యే ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రజాప్రతినిధులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పురస్కారం అందజేత

హిందూపురం : రాష్ట్ర ఫుడ్ కమిటీ ఛైర్మన్ సిహెచ్ విజయ్ ప్రతాప్ రెడ్డికి మంగళవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో పుర ప్రముఖులు, ముస్లీం నగరా, టిప్పుసుల్తాన్ జాతీయ అధ్యక్షులు ఉమర్ ఫారూఖ్ ఖాన్‌లు టిప్పుసుల్తాన్ జాతీయ పురస్కారాన్ని అందించారు. అనంతరం అతిథి గృహ ఆవరణంలో మొక్కలను నాటించారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షకుడు భాస్కర్ రెడ్డి, చైతన్య గంగిరెడ్డి, రఫీ, యాసీన్ మాలీక్ తదితరులు పాల్గొన్నారు.

అనంత ప్రజల రుణం తీర్చుకుంటాం

◆ అధికారంలోకి రాగానే ఉద్యోగాల కల్పన

◆ బిసిలకు సముచిత స్థానం కల్పిస్తాం

◆ టిడిపి అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించే బాధ్యత మీదే

◆ యువగళం పాదయాత్రలో నారా లోకేష్

అనంతపురంలో ప్రజలకు అభివాదం చేస్తున్న నారా లోకేష్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఎల్లవేళలా టిడిపిని అదరిస్తున్న ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజల అభివృద్ధికి బాటలు వేసి వారి రుణం తీర్చుకుంటామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పేర్కొన్నారు. నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర 60వ రోజు మంగళవారం అనంతపురం నగరంలో సాగింది. పంగల్ రోడ్డులో ప్రారంభమైన యాత్ర విజయనగర కాలనీ, సంగమేశ్ సర్కిల్, పవర్ ఆఫీసు, బసవన్న కట్ట, సప్తగిరి సర్కిల్ మీదుగా అంబేద్కర్ బ్రిడ్జిపై నుంచి రుద్రంపేట బైపాస్ రోడ్డు, కళ్యాణదుర్గం బైపాస్ రోడ్డు, బళ్లారి బైపాస్ రోడ్డు మీదుగా రాత్రికి ఎంవైఆర్ ఫంక్షన్ హాలు వరకు సాగింది. టిడిపి నాయకులు ఆయా కుడళ్లలో పెద్ద ఎత్తున లోకేష్‌కు స్వాగతం పలికారు. పాదయాత్రకు అనంతపురం నియోజకవర్గం ప్రజలు జన వాహినిగా హాజరై నీరాజనాలు పలికారు. తెలుగు మహిళలు హారతులు ఇచ్చి నియోజకవర్గంలోకి స్వాగతం పలికారు. టిడిపి అర్బన్ నియోజకవర్గం ఇన్‌ఛార్జి వైకుంఠం ప్రభాకర్ చౌదరి, జిల్లా అధ్యక్షులు కాలవశ్రీనివాసులు, జిల్లా టిడిపి ఇన్‌ఛార్జి బిటి.నాయుడులు లోకేష్‌కు ఘనస్వాగతం పలికారు. టీవీ టవర్ వద్ద ఆర్‌డిటి కార్యాలయాన్ని లోకేష్ సందర్శించారు. ఆర్‌డిటి ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ అన్నే ఫెర్రర్, ఆర్‌డిటి ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్, మహిళా సాధికారత డైరెక్టర్ విశాల ఫెర్రర్, ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి, దశరథ్ తదితరులతో సమావేశమై ఆర్‌డిటి అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో ప్రజలను ఉద్దేశించి లోకేష్ ప్రసంగించారు. రాష్ట్రంలో నియంత పాలన సాగుతోందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు, చేస్తున్న పరిపాలనకు ఏ మాత్రం పొంతన లేదన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం ఇలా అన్ని రంగాలనూ నిర్వీర్యం చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలు, ముస్లిములు, మైనార్టీలు అన్ని రంగాల వారు ఇబ్బందులు పడుతున్నారని తెలియజేశారు. అనంతపురం నియోజకవర్గంలో టిడిపి హయాంలో జరిగిన అభివృద్ధి మాత్రమే ఇప్పటికీ కన్పిస్తోందన్నారు.కొత్తగా జగన్ ప్రభుత్వం చేసింది ఏమీ లేదన్నారు. ముఖ్యమంత్రితో నిధులు తెచ్చుకోలేని అసమర్థ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి జగన్ ఆకాశంలో నడిచేవారని, యువగళం పాదయాత్ర ప్రారంభం, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల తరువాత నేల గుర్తొకొచ్చిందన్నారు. ఇది ట్రైలర్ మాత్రమే అని, మునుముందు వైఎస్‌ఆర్‌సిపి వైఫల్యాలను మరింత ఎండగడతామన్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గం అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించి మరోసారి అసెంబ్లీకి పంపాలని పిలుపునిచ్చారు.

చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకోవడమే లక్ష్యం

వైకుంఠం ప్రభాకర్‌చౌదరి

లోకేష్‌కు స్వాగతం పలుకుతున్న ప్రభాకర్‌చౌదరి

రాబోయే ఎన్నికల్లో నారా చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రిగా కూర్చొబెట్టడమే లక్ష్యంగా ప్రతి తెలుగుదేశం పార్టీ నాయకుడు, కార్యకర్త పని చేస్తారని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి పేర్కొన్నారు. యువగళం పాదయాత్ర సందర్భంగా విజయనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ యువనేత నారా లోకేష్ బాబు యువగళం పాదయాత్ర టిడిపి నాయకులు, కార్యకర్తల్లో నూతన ఉత్సాహాన్ని నింపిందన్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో టిడిపి హయాంలో చేసిన అభివృద్ధి పనులకు కూడా వైసిపి నాయకులు కమిషన్‌లు తిన్నారని విమర్శించారు. జాతీయ రహదారి తమ ప్రభుత్వంలోనే మంజూరు చేశామన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మిస్తే కేవలం కోవిడ్ సెంటర్‌గా వినియోగించారు తప్పా, పూర్తి స్థాయిలో వైద్యులు, సిబ్బందిని నియమించని ధీన స్థితి నెలకొందన్నారు. అండర్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు టిడిపి ప్రభుత్వం జీవో జారీ చేసిందన్నారు. అనంత కార్పొరేషన్‌లో అధికార పార్టీ కార్పొరేటర్‌లే కొట్టుకునే పరిస్థితి నెలకొందన్నారు. ఇలాంటి ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

పరిశ్రమల్లో పర్యటించి అక్కడి పరిస్థితిని తెలుసుకుంటున్న కలెక్టర్ బసంత్‌కుమార్

ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోండి

కలెక్టర్ బసంత్ కుమార్

ప్రజాశక్తి -పెనుకొండ

పరిశ్రమల పరిధిలో ఎలాంటి ప్రమాదాలూ జరగకుండా భద్రతా ప్రమాణాలు పాటించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ బసంత్ కుమార్ ఆదేశించారు. పెనుకొండ మండలంలోని ఎర్రమంచి వద్దనున్న గ్లోవియస్ ఇండియా అనంతపూర్ ప్రైవేట్ లిమిటెడ్, మోబిస్ ఇండియా మోడల్ ప్రైవేట్ లిమిటెడ్, అమ్మవారిపల్లి వద్దనున్న హుండాయ్ మెటీరియల్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, సుంగ్‌హూ హైటెక్ ఏపీ ప్రైవేట్ లిమిటెడ్, నేషనల్ ఆటో ప్లాస్ట్, కెఎస్‌హెచ్ ఆటోమేటిక్ ప్రైవేట్ లిమిటెడ్, హుండాయ్ స్టీల్ అనంతపూర్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలను కలెక్టర్ మంగళవారం నాడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా పరిశ్రమలను పరిశీలించి భద్రతపై పలు సూచనలు, సలహాలు జారీ చేశారు. ఆయా కంపెనీల్లోని ఆయా విభాగాల్లో మిషన్ల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఆయా పరిశ్రమల హెచ్‌ఆర్ మేనేజర్‌లు వివరాలను కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా పరిశ్రమల్లో ఎక్కడ ఎలాంటి చిన్నపాటి ప్రమాదం కూడా చోటు చేసుకోకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాల నివారణ కోసం చేపట్టాల్సిన చర్యలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ చాంద్‌బాషా, ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్స్‌పెక్టర్ కేశవులు, లేబర్ డిప్యూటీ కమిషనర్ రఘురాములు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ శంకర్రావు, పరిశ్రమల శాఖ డిడి మహబూబ్ బాషా, ఆయా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ముగిసిన యోగివేమన బ్రహ్మోత్సవాలు

గాండ్లపెంట : మండల పరిధిలోని కట్టారుపల్లి పంచాయతీలో జరుగుతున్న శ్రీ యోగివేమన బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిశాయి. గొడుగులు, మెరవనులతో కార్యక్రమాన్ని పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మూడు రోజుల నుంచి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి గొడుగులు, మెరవనిని వైభంగా నిర్వహించారు. ఉత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చిన ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లను చేశారు. కదిరి రూరల్ సిఐ శంకర్ నాయక్, ఎస్ఐ బి.మల్లికార్జున్ రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

మెనూ ఖచ్చితంగా పాటించాల్సిందే..!

◆ జూన్ నుంచి హాస్టల్ మెస్ ఛార్జీలు పెంపు ◆ ఏపీ ఫుడ్ కమిషన్ ఛైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి

ఇంటింటికీ రేషన్ బియ్యం వాహనం వద్ద రేసన్ పంపిణీపై ప్రజలతో మాట్లాడుతున్న ఫుడ్ కమిషన్ ఛైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో మెనూ ఖచ్చితంగా పాటించాలని ఏపీ ఫుడ్ కమిషన్ ఛైర్మన్ విజయ ప్రతాప్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం నాడు పుట్టపర్తి మండలంలోని పెడపల్లి, ఎనుములపల్లి బీసీ హాస్టళ్ల, చిత్రావతి రోడ్డులోని ప్రభుత్వ చౌక ధాన్యపు డిపో, అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ప్రభుత్వ చౌక ధాన్యపు డిపోలో సరుకులను తనిఖీ చేశారు. బీసీ హాస్టల్‌లో వారానికి మూడు కోడిగుడ్లు ఇస్తున్నారని, ఐదు గుడ్లు ఇవ్వాలన్నారు. విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యత బాగుండాలని సూచించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో పలువోట్ల చౌక ధాన్యపు డిపోల పరిధిలో ఎండియు వాహనాలు ఇంటింటికీ వెళ్లడం లేదని తన దష్టికి వచ్చిందన్నారు. ఇంటింటికీ వెళ్లి సరుకులు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు హాస్టళ్లలో జూన్ నుంచి విద్యార్థులకు అందించే మెస్ ఛార్జీలు పెంచనున్నట్లు చెప్పారు. అంగన్వాడీ కేంద్రాలకు వస్తున్న పౌష్టికాహారం సక్రమంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పంపిణీ చేయాలని సూచించారు. ప్రజా పంపిణీ, ఇతర ఆహార పంపిణీ కార్యక్రమాల్లో అవకతవకలు జరిగితే 9490551117 వాట్సాప్ నెంబర్‌కు సమాచారం ఇస్తే తాము స్పందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రమణారెడ్డి, ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ లక్ష్మీకుమారి, ఆర్డీవో భాగ్యరేఖ, తహశీల్దార్ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

గోరంట్ల టౌన్ : మండలంలో కేజీబీవీ ప్రభుత్వ పాఠశాలలో ఏపీ ఫుడ్ కమిషన్ ఛైర్మన్ ప్రతాప్ రెడ్డి మంగళవారం తనిఖీలు చేశారు. పాఠశాలలో భోజనాన్ని రుచి చూశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలన్నారు. అనంతరం మందలపల్లి గ్రామంలో ఎఫ్‌సి షాప్‌ను తనిఖీ చేశారు. ఎండియు వాహనాల ద్వారా ఇళ్ల వద్దకెళ్లి కార్డుదారులకు బియ్యం పంపిణీ చేయాలని ఆదేశించారు.

హిందూపురం : పురపాలక సంఘం పరిధిలోని కొట్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మన్ విజయ్ ప్రతాప్ రెడ్డి మంగళవారం ఆకస్మిక తనఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఇవ్వాడానికి సిద్ధంగా ఉంచిన రాగి జావాను ఆయన స్వయంగా తాగి, స్వయంగా విద్యార్థులకు పంపిణీ చేశారు. మెనూ ప్రకారం భోజనాలు అందిస్తున్నారా, భోజనం రుచికరంగా ఉందా, సమయానికి భోజనాలు అందిస్తున్నారా, కోడిగుడ్లు, చిక్కి అరటి పళ్ళు బాగున్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు బాగా చదువుకుని మంచి స్థానానికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి గంగప్ప, హెచ్‌ఎం కేశవమూర్తి, అంజనమూర్తి, ఎంఆర్‌సి సిబ్బంది తౌసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

1-30గంటలకే సచివాలయం మూత..!

ప్రజాశక్తి-రొద్దం

సాయంత్రం 5 గంటల వరకు విధులు నిర్వహించాల్సిన సచివాలయం మధ్యాహ్నం 1-30 గంటలకే మూతబడింది. మండలంలోని దొడగట్ట గ్రామ సచివాలయం మంగళవారం నాడు మధ్యాహ్ననిక మూసి వేశారు. దీంతో వివిధ సమస్యలపై సచివాలయానికి వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సచివాలయ పంచాయతీ కార్యదర్శి రవిరాజ్ మెడికల్ లీవ్‌లో ఉన్నారు. మహిళా కానిస్టేబుల్ సెలవులో ఉన్నారు. రెవెన్యూ సెక్రెటరీ గోపాల్ తహశీల్దార్ కార్యాలయానికి పని నిమిత్తం వెళ్లారు. ఏఎన్‌ఎం కూడా మండల కేంద్రంలో ఉన్న ఆసుపత్రికి వెళ్లారు. అగ్రికల్చరల్ సిబ్బంది రిజిస్టర్‌లో సంతకం చేసి క్షేత్ర పరిశీలనకు వెళ్లారు. ఇలా అందరూ వెళ్లిపోవడంతో సచివాలయానికి మధ్యాహ్నం తాళాలు వేశారు. సచివాలయం మూత వేయడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సచివాలయంలో కనీసం సమాచారం ఇచ్చే వారు కూడా లేకుండా తలుపులు మూసి వేయడం సరికాదని, దీనిపై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మధ్యాహ్ననానికే సచివాలయం మూసి వేయడంతో సిబ్బంది కోసం బయట వేచి ఉన్న గ్రామస్తులు

ఆర్థిక సాయాన్ని అందిస్తున్న వేణుగోపాలరావు

బాధితునికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-పరిగి

క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ వైద్య చికిత్సల కోసం ఇబ్బంది పడతున్న వ్యక్తికి దివ్య ఎడ్యుకేషనల్ ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు వేణగోపాలరావు ఆర్థిక సాయం అందించారు. పరిగి మండలం కోనాపురానికి చెందిన నంజుండప్ప క్యాన్సర్ మందుల కొనుగోలు నిమిత్తం రూ.5వేల ఆర్థిక సాయాన్ని సోమవారం అందించారు. దీంతో పాటు పరిగి మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు బట్టలు పంపిణీ చేసి, భోజనం అందించారు. వేసవిలో అంగన్వాడీ విద్యార్థులకు వేడి నుంచి ఉపశమనం కలిగించేందుకు అంగన్వాడీ పాఠశాలకు సీలింగ్ ఫ్యాన్‌ను అందించారు. ప్రతి ఏడాదీ తన కుమార్తె జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వేణుగోపాలరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి లక్ష్మీదేవి, శివశంకర్, ఎంపిటిసి పాల్గొన్నారు.

చేనేతల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

చేనేతల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని తెలుగుయువత, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీలు తిరుమలేశ్, ఇర్దార్లు పేర్కొన్నారు. చేనేతల సమస్యల పరిష్కారం కోసం చేనేత కార్మికసంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన 36 గంటల నిరసన దీక్షకు వారు మంగళవారం నాడు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిప అధికారంలోకి వచ్చాక చేనేతల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. ముడిసరుకుల ధరలు విపరీతంగా పెరగడంతో వాటిని కొనుగోలు చేయలేని స్థితిలో కార్మికులున్నారన్నారు. ప్రభుత్వం చేనేతలపై నిర్లక్ష్యం వీడి వారిని ఆదుకునే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు అశోక్, నాయకులు చిన్నూరు వినోద్, బిల్లేరామకష్ణ, గొట్లూరు వినోద్, రమేష్ పాల్గొన్నారు.

పెద్దమ్మ ఆలయంలో 'చిలకం' ప్రత్యేక పూజలు

పెద్దమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న చిలకం మధుసూదన్‌రెడ్డి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

మండల పరిధిలోని గొట్లూరు గ్రామంలో వెలసిన పెద్దమ్మతల్లికి గ్రామస్తులు మంగళవారం నాడు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి పెద్దమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఫుడ్ కమిషన్ ఛైర్మన్‌కు ఘన స్వాగతం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఆంధ్ర ప్రదేశ్ ఫుడ్ కమిషన్ ఛైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డికి పుట్టపర్తి తహశీల్దార్ నవీన్‌కుమార్ ఘన స్వాగతం పలికారు. గోరంట్ల మండలంలో పర్యటన ముగించుకుని మంగళవారం నాడు పుట్టపర్తికి విచ్చేశారు. పుట్టపర్తి మండలం పెడపల్లి వైఎస్ఆర్ కాలనీ సమీపంలో తహశీల్దార్ ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న వారితో మీ గ్రామంలో సరిగా రేషన్ బియ్యం అందుతున్నాయా.. అంగన్వాడీ సెంటర్లలో సరిగా పౌష్టికాహారం అందిస్తున్నారా అని ప్రశ్నించారు. గువ్వల గుట్టపల్లి, కొట్లపల్లి, గ్రామాల్లో ప్రజలకు డీలర్లు రేషన్ బియ్యం సరిగా అందించలేదని అధికారులు దష్టికి తీసుకువెళ్లారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-గోరంట్ల

పట్టణంలో గిరిజన బాలికల ప్రభుత్వ పాఠశాలలో వైద్యాధికారి సాయి సుప్రీత ఆధ్వర్యంలో విద్యార్థులకు మంగళవారం నాడు వైద్య పరీక్షలను నిర్వహించారు. విద్యార్థులకు అవసరమైన మందులు పంపిణీ చేశారు. అనంతరం వైద్యాధికారి డాక్టర్ సాయి సుప్రీత మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ ఎఎన్ఎం అనిత, ఆశా వర్కర్ సుజాత గాయత్రి పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన జర్నలిస్టులు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జర్నలిస్టులకు వెంటనే నూతన అక్రిడిటేషన్లు మంజూరు చేయాలని కోరుతూ ఐజేయు, ఏపీడబ్ల్యూజే, ఏపీడబ్ల్యూజెఎఫ్ జర్నలిస్టు సంఘాలు కలెక్టర్ బసంత్‌కుమార్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐజేయు జాతీయ కార్యవర్గ సభ్యుడు అయ్యన్నగారి శ్రీనివాసులు మాట్లాడుతూ వెంటనే నూతన అక్రిడేషన్లు, బస్ పాసులు మంజూరు చేయాలన్నారు. అక్రిడిటేషన్లకు సంబంధించి ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన అసంబద్ధ జీవోను రద్దు చేయాలన్నారు. ఇంటి స్థలాల పట్టాల సమస్య పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

మహిళాభివృద్ధిలో ఏపీ దేశానికే ఆదర్శం

ఎమ్మెల్సీ మొహమ్మద్ ఇక్బాల్

ప్రజాశక్తి-హిందూపురం

మహిళాభివద్ధిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ పేర్కొన్నారు. మంగళవారం నాడు పట్టణంలోని ఎంజిఎం మైదానంలో హిందూపురం పురపాలక సంఘ వ్యాప్తంగా మెప్మా మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మూడవ విడత ఆసరా నిధులకు సంబంధించి మెగా చెక్కును అందించారు. ఈ సందర్భంగా మునిసిపల్ ఛైర్‌పర్సన్ డిఎస్.ఇంద్రజ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీతో పాటు మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, వైసిపి మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్ రెడ్డి, వైస్ ఛైర్మన్ జబీవుల్లాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ అధికార కోసం చంద్రబాబులాగా జగన్ మోహన్ రెడ్డి ప్రజలను మోసం చేయలేదన్నారు. ఎన్ని కష్టాలు ఉన్నా ఇచ్చిన మాట కోసం అక్కచెల్లెమ్మలకు మూడో ఏడాది కూడా డ్వాక్రా రుణమాఫీకి రూ.13.68 కోట్లు విడుదల చేశారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా మహిళలు 'ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు గిరీష్, మల్లికార్జున, మద్దన జయప్ప, సునీత, రోషన్, ముస్తక్, రేష్మా బాను, చాంద్‌బాషా, సాధిక్‌తో పాటు మహిళలు పాల్గొన్నారు.



మహిళలకు చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ మొహ్మద్ ఇక్బాల్

మహవీర్ జయంతిలో పాల్గొన్న ఎమ్మెల్సీ

మహవీర్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని జైన్ మందిర్‌లో ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానికంగా ఉన్న జైనులకు జయంతి శుభకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ నాగేంద్ర బాబు పాల్గొన్నారు.

రసీదులున్నా.. చేయి తడపాల్సిందే..!

ప్రజాశక్తి-కదిరి అర్బన్

కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లి సమీపాన ఉన్న మార్కెట్‌యార్డులో ప్రతి మంగళవారం మేకల సంత నిర్వహిస్తారు. ఈ సంతకు సుదూర ప్రాంతాల నుంచి మేకలు, గొర్రెలు, పొట్టేళ్లు, పశువులను తీసికొచ్చి క్రయవిక్రయాలు చేస్తుంటారు. యార్డులో జీవాలను కొనుగోలు చేస్తే మార్కెట్ యార్డ్ అధికారులు అందుకు సంబంధించిన రసీదు ఇస్తున్నారు. ఈ రసీదు ఉన్నా ప్రధాన రహదారుల్లో చేయిఎత్తిన కానిస్టేబుళ్ల అందరికీ డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితులు ఉన్నట్లు తెలుస్తోంది. మంగళవారం నాడు మార్కెట్‌యార్డుకు వచ్చిన పలువురు గొర్రెల కాపరులు వారి సమస్యలను ఏకరువు పెట్టారు. మార్కెట్‌యార్డులో జీవాలు కొనుగోలు చేసిన సమయంలో అధికారులు బిల్లులు ఇస్తున్నారని చెప్పారు. రోడ్డుపై వెళ్తున్న సమయంలో ఈ బిల్లులను చూపించినా పోలీసులు ఒప్పుకోవడం లేదన్నారు. ఎంతో కొంత ఇస్తే తప్పా వాహనాన్ని ముందుకు వెళ్లనీయడం లేదన్నారు. ఈ విషయం మార్కెట్ యార్డులో అధికారులకు చెబితే బయట జరిగే దానికి తమకు సంబంధం లేదని వారు చెబుతున్నారన్నారు. క్రయ, విక్రయాలు చేసే సమయంలో మార్కెట్‌యార్డు ఇచ్చే రసీదులు చేతిలో ఉన్నా ఇలా కొందరు పోలీసు సిబ్బంది డబ్బులు తీసుకోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గొర్రెల కాపరులతో అక్రమంగా డబ్బులు వసూలు చేయకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మార్కెట్‌యార్డులో గొర్రెలు, మేకలను కొనుగోలు చేస్తున్న కాపరులు



ఆసరా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

ఆసరాతో మహిళలకు ఆర్థిక చేయూత

ఎమ్మెల్యే డా॥ పివి.సిద్ధారెడ్డి

ప్రజాశక్తి-తలుపుల

మహిళలను ఆర్థికంగా ఆదుకోవాలన్న ఉద్దేశంతో వైఎస్సార్ ఆసరా ద్వారా సాయం అందిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ పివి.సిద్ధారెడ్డి తెలిపారు. మంగళవారం నాడు తలుపులలో వైఎస్సార్ ఆసరా సదస్సును వ్యవసాయ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా రుణాలను ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి మాఫీ చేస్తున్నారని చెప్పారు. తలుపుల మండలంలో 3వ విడత ఆసరా కింద రూ.5.78 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పతంలో ముందుకు వెళ్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మహమ్మద్ రఫీ, సర్పంచి పల్లె శ్రీలత, రాయలసీమ జోనల్ ఇన్‌ఛార్జి డికె.బాబు, పురుషోత్తం రెడ్డి, ఫయాజ్ అహ్మద్, వెలుగు ఎపిఎం బాబ్జీతో పాటు వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

'జగనన్నే మా భవిష్యత్తు'పై దిశానిర్దేశం

మండల కేంద్రంలోని ఎంపిపి ఛాంబర్‌లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంపై ఎమ్మెల్యే సిద్ధారెడ్డి సమావేశం నిర్వహించారు. వైసిపి ప్రజా ప్రతినిధులు, జెసిఎస్ మండల ఇన్‌ఛార్జులు, సచివాలయ కన్వీనర్లు, గహ సారథులు, వాలంటీర్లు సమన్వయంతో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు.

సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర నారాయణ

ఎమ్మెల్యే శంకర నారాయణ

ప్రజాశక్తి-పరిగి

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజల కోసం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే శంకర నారాయణ వైసిపి నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సమన్వయకర్తలకు సూచించారు. మంగళవారం నాడు మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అమలు చేశారన్నారు. ఈ సంక్షేమాన్ని ప్రజలకు తెలియజేసి 2024లో మరోసారి వైసిపి అధికారాన్ని పొందే విధంగా ప్రతి కార్యకర్త, నాయకులు పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ నరసింహమూర్తి, నాయకులు ప్రభాకర్, జెడ్పిటిసి శ్రీరాములుతో పాటు పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

2024లోనూ మడకశిర వైసిపి అభ్యర్థి నేనే..!

ఆసరా కార్యక్రమంలో ఎమ్మెల్యే డా॥తిప్పేస్వామి

ఆసరా పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డా॥తిప్పేస్వామి

ప్రజాశక్తి-గుడిబండ

2024లో మడకశిర నుంచి వైసిపి అభ్యర్థిగా తానే బరిలో ఉంటానని ఎమ్మెల్యే డా॥తిప్పేస్వామి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మూడో విడత ఆసరా పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళాభివృద్ధి కోసం ప్రభుత్వం అన్ని రకాల చేయూతను అందిస్తోందని చెప్పారు. ఆసరా పథకం ద్వారా వెలుగు సంఘంలో మహిళలకు రుణామాఫీ చేస్తున్నట్లు చెప్పారు. రాబోయే 2024 ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేసుకుంటే రాష్ట్రం మరింత అభివద్ధి చెందితుందని తెలిపారు. 2024 ఎన్నికల్లో వైసిపి నుంచి తనకే మడకశిర నియోజకవర్గం టికెట్ వస్తుందని, తనకు మళ్లీ ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఎమ్మెల్యేగా మరో అవకాశం కల్పిస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోనూ అభివద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాధమ్మ. జెడ్పీటీసీ భూతరాజు. సింగల్ విండో అధ్యక్షులు చంద్రప్ప, తహశీల్దార్ నాగభూషణం, ఎంపీడీవో రామారావు, వెలుగు ఏపీఎం ముత్యాలప్ప, మండల సచివాలయ కన్వీనర్ శివకుమార్, ఎస్సీ సెల్ కన్వీనర్ రమేష్, మండల డీలర్ల సంఘం అధ్యక్షులు నాగరాజు, ఉపాధ్యక్షులు శివరాజ్, పాల్గొన్నారు.

బీమా సాయం అందజేత

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణం లోని బోయ వీధిలో బసవరాజ్ అనే వ్యక్తి ఆకస్మికంగా మతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ వైస్ ఛైర్మన్ పెనుజూరు నాగరాజు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు బీమా పథకంలో భాగంగా మృతుని నామిని అయిన ఎం.భారతికి తక్షణ సహాయం కింద రూ.పదివేల సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ వెల్ఫేర్ కార్యదర్శి ఆంజనేయులు, వాలంటీర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బీమా సాయం అందజేస్తున్న వైస్ ఛైర్మన్ నాగరాజు

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

అనంతపురం : రాష్ట్ర ప్రభుత్వం వెంటనే డీఎస్సీ విడుదల చేసి నిరుద్యోగ యువతను ఆదుకోవాలని ఆర్‌పిఎస్ అధ్యక్షులు పోతుల నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. డీఎస్సీ విడుదల చేయకపోవడంతో రాష్ట్రంలో నిరుద్యోగులకు న్యాయం జరగడం లేదన్నారు. ఇప్పటికే దాదాపు 8 లక్షల మంది టెట్ పాసై డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్నారన్నారు. అలాగే పాఠశాలల్లో ఉపాధ్యాయులు కొరత ఉండటం వల్ల ఆరేళ్లుగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే పరిస్థితి లేదన్నారు. అంతేగాకుండా వేలసంఖ్యలో ప్రభుత్వ పాఠశాలలను మూసివేయడంతో గ్రామీణ ప్రాంతాల్లో పేద, మధ్య తరగతి, దళిత, గిరిజన, బలహీన వర్గాలకు చెందిన పిల్లలు చదువులకు దూరం అవుతున్నారన్నారు. జనాభా పెరిగేకొద్దీ ప్రభుత్వ పాఠశాలలను పెంచాల్సిన సమయంలో ఉన్న పాఠశాలలను తగ్గించడం బాధాకరమన్నారు.

బీటెక్ ఫలితాలు విడుదల

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు పరిధిలో నిర్వహించిన బీ.టెక్ 2వ సంవత్సరం, 1వ సెమిస్టర్ (ఆర్.20) రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను మంగళవారం విడుద చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ఇ. కేశవరెడ్డి, కంట్రోలర్ బి.చంద్రమోహన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాల కోసం జెఎన్‌టియు వెబ్‌సైట్ http://jntuaresults.ac.inను సంప్రదించాలని కోరారు.

పరీక్షలు లేని రోజు ఒంటిపూట బడి నిర్వహించాలి : డిఇఒ

అనంతపురం సిటీ : జిల్లాలోని అన్ని ప్రయివేట్ పాఠశాలలు ఒంటిపూట బడి మాత్రమే నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరాం మంగళవారంలో ఒక ప్రకటనలో ఆదేశాలు జారీ చేశారు. పదవ తరగతి పరీక్ష జరుగుతున్న కేంద్రాల్లో పరీక్షలు ఉన్న రోజు సెలవు ప్రకటించాలన్నారు. పరీక్షలు లేని రోజు మాత్రమే ఒంటిపూట బడి (ఉదయం 7:30 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు) నిర్వహించాలన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

గుత్తి : పట్టణంలోని ఈద్గా మైదానం సమీపంలో నివాసం ఉండే షంషాద్ (55) మంగళవారం విద్యుఘాతంతో మృతిచెందింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కర్నూలు రోడ్డులో బజ్జీలు విక్రయిస్తూ జీవనం కొనసాగించే షంషాద్ ఇంట్లో ఫ్యాన్ స్విచ్ వేస్తుండగా విద్యుదాఘాతానికి గురైంది. గమనించిన కుటుంబసభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందిందని నిర్ధారించారు.

నేరాలు ఘోరాలు

కడుపునొప్పి తాళలేక వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-గాండ్లపెంట

కడుపునొప్పి తాళలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని తూపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు... తూపల్లి పంచాయతీకి చెందిన పి.చంద్రశేఖర్ రెడ్డి(60) గత కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. సోమవారం రాత్రి నొప్పి తీవ్రం కావడంతో భరించలేక ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయన్ను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కదిరి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించగా, పరిస్థితి విషమించి మరణించాడు. మతునికి భార్య, కుమారుడు ఉన్నారు. ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మల్లికార్జున తెలిపారు.

తేనెటీగల దాడి

ప్రజాశక్తి-కనగానపల్లి

మండల పరిధిలోని పర్వతదేవరపల్లి గ్రామంలో మంగళవారం నాడు 20మందిపై పెద్ద తేనెటీగలు దాడిచేశాయి. స్థానికులు తెలిపిన వివరాలమేరకు.. గ్రామంలో పోతలయ్య స్వామి బోనాలు జరిపిస్తుండగా ఉరుముల శబ్దాలకు గ్రామ సమీపంలో చెట్ల పొదల్లో ఉన్న పెద్ద తేనేటిగాలు పైకి లేచాయి. పోతలయ్యస్వామికి బోనాలు తీసుకెళ్తున్న పలువురిపై దాడి చేశాయి. దాడిలో గాయపడిన 20మందిని అనంతపురం, కర్నూల్ ఆసుపత్రికి తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.

హిందూపురం అనంత పద్మనాభ స్వామి దేవాలయంలో నంది విగ్రహం చోరీ

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం పట్టణంలోని అనంత పద్మనాభస్వామి దేవాలయంలో రాతి నంది విగ్రహం సోమవారం రాత్రి చోరీకి గురైంది. అర్ధరాత్రి వేళలో గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలోకి చొరబడి నంది విగ్రహాన్ని దోచుకెళ్లినట్లు తెలుస్తోంది. ఆలయ అర్చకుడు, దేవాదాయ శాఖ అధికారులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి... హిందూపురం రైల్వే రోడ్ ప్రధాన రహదారిలో పురాతన అనంత పద్మనాభస్వామి ఆలయం ఉంది. 1956 సంవత్సరంలో దీనిని ప్రతిష్ఠించినట్లు తెలుస్తోంది. సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండడుగులో ఆలయం తలుపులు పగలగొట్టి లోపలకు చొరపడి నంది విగ్రహాన్ని చోరీ చేశారు. ఈ చోరీ వెనుక గుప్త నిధుల వేటగాళ్ల హస్తం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆలయ పరిసర ప్రాంతాలను సిఐ వెంటకటేశ్వర్లు పరిశీలించారు. పరిసర ప్రాంతాల్లో సిసి టివిల ఆధారంగా నిందితులను కనుగొనే ప్రయత్నం చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అనంత పద్మనాభ స్వామి ఆలయంలో నంది విగ్రహాన్ని చోరీ చేసిన వారిని వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలని ఛత్రపతి శివాజీ ట్రస్టు సభ్యులు కోరారు.

అనంత పద్మనాభ స్వామి ఆలయంలో చోరీకి గురైన నంది విగ్రహం

సిఎం జగన్, కేతిరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న సాయికుమార్

పేదల పక్షపాతి వైసిపి

మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ మాసపల్లి సాయికుమార్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పేదల పక్షపాతి వైసిపి అని మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్, కౌన్సిలర్ మాసపల్లి సాయికుమార్ పేర్కొన్నారు. మంగళవారం నాడు 9వ వార్డులో ఆసరా వారోత్సవాలను నిర్వహించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేసి, కేకును కట్ చేశారు. అనంతరం మాసపల్లి సాయికుమార్ మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయనంతగా మహిళల ఆర్థికాభివృద్ధికి వైసిపి ప్రభుత్వం చేయూతనిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు సురేష్ కుమార్, ఓం ప్రకాష్, శ్రీనివాసులు, వెల్ఫేర్ కార్యదర్శి వలి, ఆర్పీలు హరిత, భవానీ, సంగీత పాల్గొన్నారు.

రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో విజిలెన్స్ కమిటీలను నియమించాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి విజిలెన్స్ కమిటీలు, వినియోగదారుల కమిటీలను వెంటనే ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డికి రాష్ట్ర వినియోగదారుల సమాఖ్య కో కన్వీనర్ గడుగు సురేష్ కుమార్ విన్నవించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకుని వినతిపత్రం సమర్పించారు. ఈ కమిటీలు ఏర్పాటు చేస్తే ప్రజా పంపిణీ వ్యవస్థ పక్కదారి పట్టకుండా దోహదపడతాయన్నారు.

లింగాల లోకేశ్వర్‌రెడ్డికి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కదిరి టౌన్

వైసిపి రాష్ట్ర లీగల్ ప్రధాన కార్యదర్శి, కదిరి బార్ అసోసియేషన్ అధ్యక్షులు లింగాల లోకేశ్వర్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం నాడు కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్ నివాసంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుమ్మరవాండ్లపల్లి మాజీ సర్పంచి బత్తల వెంకటరమణ, వైసిపి పట్టణ అధ్యక్షులు బహావుద్దీన్, అన్సర్ వలి, 14వ వార్డ్ కౌన్సిలర్ మహబూబ్ బాషా, బీసీ ప్రచార కమిటీ రాష్ట్ర అధ్యక్షులు సంపంగి గోవర్ధన్, కాంగ్రెస్ అమీర్‌భాయ్, మస్తాన్ ఖాన్, సౌదీ అన్వర్, దాదాపీర్, ముబారక్, పవన్ కుమార్ రెడ్డి, పాశం భాస్కర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న లింగాల లోకేశ్వర్‌రెడ్డి